● అన్నదాతల ఆందోళన..



బచ్చోడులో ధాన్యాన్ని రాశులుగా పోసుకున్న రైతులు

తుపాన్ ప్రభావంతో మబ్బులు కమ్ముకుని వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో ధాన్యం, పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్ల వెంట ఎక్కడ చూసిన ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం, ధాన్యం తూర్పార పట్టాలనే నిబంధనలతో కొంతమంది రైతులు పంటలను కాపాడుకునేందుకు పట్టాలు కప్పుకుని రక్షించుకుండగా.. మరికొంతమంది ప్రైవేట్ వ్యాపారుస్తులకు విక్రయిస్తున్నారు. కాగా, మండలంలోని బచ్చోడులో వరికోతలు మొదలై ధాన్యం రాశులు పోస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో హార్వెస్టర్ల కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాలు పడితే వరి, పత్తి పంటలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తేమ శాతం, తూర్పార విధానాన్ని మినహాయించి కొనుగోలు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

– తిరుమలాయపాలెం

● పార్కింగ్‌పై పట్టింపేది..?



ఇందిరానగర్ పాఠశాల వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు

చిత్రంలో కనిపిస్తున్న వాహనాలను చూస్తుంటే ఇదేదో పార్కింగ్ ప్లేస్‌గా ఉన్నట్లు కనిపిస్తుంది కదూ. అయితే అది నిజం కాదు. నగరంలో ప్రధాన జంక్షన్‌గా మారిన ఇందిరానగర్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వైరా రోడ్డు నుంచి వచ్చే వాహనాలు టేకులపల్లి వైపు బైపాస్ రోడ్డుకు వెళ్లడానికి అనువుగా గత మూడేళ్ల క్రితం ఇందిరానగర్ పాఠశాల పక్క నుంచి లింక్ రోడ్డు నిర్మించారు. అయితే వివిధ పనుల కోసం వచ్చి వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు తమ ద్విచక్రవాహనాలను ఇలా రోడ్డుకు ఇరువైపుల పార్కింగ్ చేస్తున్నారు. దీంతో లింక్‌రోడ్డు జంక్షన్ వద్ద అవి కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చూడాలని, అవసరమైతే పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– ఖమ్మంఅర్బన్

క్లుప్తంగా

నేడు టాలెంట్ టెస్ట్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరమ్(టీబీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 30(నేడు)న పాఠశాలస్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెసర ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు జీవశాస్త్రం సబ్జెక్ట్‌పై ఇంగ్లిష్, తెలుగు మీడియంలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు టీబీఎస్ఎఫ్ బాధ్యుల సమక్షంలో జరుగుతుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ‘విన్‌ఫీల్డ్’ విద్యార్థి

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–10 విభాగంలో లాంగ్‌జంప్‌లో తమ పాఠశాల విద్యార్థి పునాటి అలోక్ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు విన్‌ఫీల్డ్ పాఠశాల యాజమాన్యం గద్దె పుల్లారావు, మన్నె కిషోర్, పోలవరపు శ్రీకాంత్‌లు తెలిపారు. శుక్రవారం విద్యార్థి అలోక్‌ను అభినందించిన వారు మాట్లాడుతూ.. వచ్చే నెల 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఘనంగా ఇరుముడి

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో రామాలయం, సాయిబాబా మందిరంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు ధనియాకుల మాధవరావు, హన్మంతరావు, జక్కంపూడి ఉపేందర్ ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. భక్తులకు అన్నదానం చేశారు.

బహుమతుల ప్రదానం

ఖమ్మంరూరల్: 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పాఠశాలల విద్యార్థులకు మండల విద్యా వనరుల కేంద్రంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎంపీడీఓ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి వెన్నెల, ద్వితీయ బహుమతి ఎం.సుధీర్, తృతీయ బహుమతి సీహెచ్.శైలజ గెలుచుకోగా వారిని ఎంపీడీఓ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు

ఖమ్మంమయూరిసెంటర్: డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడపొద్దని ఏఎంవీఐ స్వర్ణలత విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నగరంలోని బీసీ బాలుర కళాశాల వసతిగృహం(పాలేరు)లో ఆర్టీఏ శాఖ అధికారులు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు లైసెన్సు పొందిన తర్వాతనే వాహనాలను నడపాలని, ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి నెల్లూరి నాగేశ్వరరావు, కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పర్యటన

నేలకొండపల్లి: పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మండలంలోని బైరవునిపల్లిలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా బాలబోయిన రవి–ఉమారాణి నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం పలు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్యతో పాటు రేణుబాబు, శీలం వెంకటలక్ష్మి, కనకబండి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మానికి చేరిన ఉద్యమకారుల పాదయాత్ర

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సూర్యాపేట నుంచి భద్రాచలం వరకు నిర్వహిస్తున్న పాదయాత్ర శుక్రవారం ఖమ్మానికి చేరుకుంది. ఈ సందర్భంగా టీజేఎస్ జిల్లా కన్వీనర్ వి.బాబు మాట్లాడుతూ.. ఉద్యమకారుల సమస్యలపై ఖమ్మంలోని ముగ్గురు మంత్రులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సామా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నరసింహారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరసనలు.. వినతులు

● విద్యార్థిని మృతికి నిరసన..



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కూసుమంచి: గురుకుల పాఠశాలలో విషాహారం తిని విద్యార్థిని మృతిచెందిన ఘటనకు నిరసనగా శుక్రవారం కూసుమంచి మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పొనుకుల సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల పాఠశాలల్లో నాణ్యత లేని ఆహారం అందిస్తూ విద్యార్థులను బలితీసుకుంటున్నారన్నారు. శనివారం ఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శీలం ఉమేష్, నాగేశ్వరరావు, నవదీప్, గణేష్, సాయి పాల్గొన్నారు.

● అజ్ఞాత దళ కమాండర్ అరెస్టుకు..

తిరుమలాయపాలెం/కూసుమంచి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ కమాండర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పూనెం రమేష్ అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం నిరసన తెలిపారు. ఈనేపథ్యాన తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ ఆధ్వర్యాన, కూసుమంచిలో ఇఫ్టూ జిల్లా నాయకుడు ఐ.వెంకన్న ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేయడం హేయమని, ఎటువంటి హాని తలపెట్టకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పోలెపొంగు నాగయ్య, గొర్రెపాటి వీరస్వామి, పేరం వెంకటేశ్వర్లు, బ్రహ్మాచారి, పట్టాభి, షబ్బీర్, మాతంగి రామస్వామి, చెరుకుపల్లి వీరయ్య, గోపె రవి, కనకం గోపాల్, నాగన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఖమ్మం సహకారనగర్: ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీఎఫ్ఐ) ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నాకు శుక్రవారం జిల్లాకు చెందిన టీఎస్‌యూటీఎఫ్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్లతో తరలినట్లు చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా రవితో పాటు జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారన్నారు.

● ప్లాస్టిక్ నిర్మూలన, హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెం రోడ్డులోని కాకతీయ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్లాస్టిక్ నిర్మూలన, హెల్మెట్ వినియోగంపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ఫరీద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● జీవన భృతి చెల్లించాలని వినతి

రఘునాథపాలెం: వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు జీవనభృతి ఇవ్వాలని, ఉపాధి హామీ కార్మికులకు రోజుకు రూ. 600 కూలీ ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి తహసీల్దార్ విల్సన్‌బెన్నీకి వినతి పత్రం అందించారు. డిసెంబర్ 2 తేదీన ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎంఎస్) ఖమ్మం జిల్లా నాయకురాలు ఆవుల మంగతాయి, ఖమ్మం డివిజన్ కార్యదర్శి కేలోతు పాపారావు, చల్ల రాజు, మేక పిచ్చయ్య, భూక్య శంకర్, బానోత్ వీరు, తదితరులు పాల్గొన్నారు.

● టన్ను చెరుకుకు రూ.4 వేలు ఇవ్వాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నేలకొండపల్లి: చెరుకు సాగు రైతులకు మధుకాన్ యాజమాన్యం టన్నుకు రూ.4 వేలు ఇవ్వాలని చెరుకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మేనేజర్‌ను కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెరుకును ఫ్యాక్టరీకి తరలించిన 14 రోజుల్లోనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎమ్మార్పీ రూ.3400తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల మాదిరిగా రూ.600 బోనస్ చెల్లించాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రచ్చా నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, తోటకూరి రాజశేఖర్, ఇంటూరి అశోక్, రాసాల కనకయ్య, యలమద్ది లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

● విద్యార్థులు ఇంగ్లిష్‌లో చదివేలా చూడాలి

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా ఇంగ్లిష్‌లోనే చదివేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ సూచించారు. శుక్రవారం నగరంలో వెలుగుమట్ల (గొల్లగూడెం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే – 2024 ప్రాధాన్యత గురించి వివరించారు. వార్షిక పరీక్షలకు సమయం తక్కువగా ఉందని, ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఇంగ్లిష్‌పై దృష్టిసారించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏజీ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీపడొద్దు

ఖమ్మంఅర్బన్: పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీపడొద్దని ఏజెన్సీల నిర్వాహకులకు ఖమ్మం అర్బన్ ఎంఈఓ కేవీ శైలజాలక్ష్మి సూచించారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో నగరంలోని వివిధ పాఠశాలలకు భోజనం అందించే ఏజెన్సీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నామ్స్ ప్రకారం మెనూ కచ్చితంగా అమలుచేయాలని, వంట ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలని, కూరగాయలు, సరుకులు కూడా నాణ్యతగా ఉండాలని సూచించారు.

● ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదం

రఘునాథపాలెం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని ఎంఈఓ వి.రాములు పేర్కొన్నారు. శుక్రవారం రఘునాథపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతి ప్రదానం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల స్ఫూర్తితో భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని విద్యలో ప్రగతి సాధించాలన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులు యోగిత, సోని, శ్రీహర్షిత, జస్వంత్, ఉదయశ్రీ, సహస్ర, ఎం.అంకితలు డిసెంబర్‌లో జిల్లాస్థాయిలో జరుగే పోటీ పరీక్షలో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ కన్వీనర్ శివకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పీఏసీఎస్‌లో రైతు పండుగ వేడుకలు

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలోని కొండాయిగూడెం పీఏసీఎస్‌లో శుక్రవారం ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా రైతు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సొసైటీ అధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, పంట నష్టపోయిన రైతులకు 30 రోజుల్లోనే నేరుగా బీమా సొమ్ము జమ చేసిందని, ప్రస్తుతం క్వింటా సన్నవడ్లకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అంబడిపూడి వెంకటేశ్వర్లు, దండగల దేవేందర్, వీరభద్రరావు, ఏఈఓ వేదిత, సీఈఓ ముత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

● లక్ష బిల్వార్చన పూజలు



శాంతి కల్యాణం జరుపుతున్న అర్చకులు

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం/ఖమ్మంగాంధీచౌక్: కార్తీకమాసోత్సవాల్లో భాగంగా నగరంలోని గొల్లగూడెం గోశాల వద్ద శారదాంబ దేవాలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. అలాగే రఘునాథపాలెం మండలం చిమ్మపుడిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి స్వాతి జన్మనక్షత్రం సందర్భంగా చిమ్మపుడి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో కార్తీక దీపోత్సవం, సహస్ర దీపాలంకరణ నిర్వహించగా.. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. అలాగే నగరంలోని ట్రంక్‌రోడ్‌లో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి భక్తుల కోలాటాల నడుమ స్వామి వారి శాంతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మలు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

● రుణమాఫీ చరిత్రలో నిలుస్తుంది..



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సైదబాబు

రఘునాథపాలెం: ఎక్కడా లేని విధంగా రైతుల రుణాలు మాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు చరిత్రలో నిలిచిపోతారని వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి సైదబాబు పేర్కొన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మూడు విడతల్లో రుణాలు మాఫీ చేయగా, మిగిలిన రైతులకు కూడా విడుదల చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. కాగా, మహబూబ్‌నగర్‌లో శనివారం జరగనున్న రైతు పండుగకు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రావూరి కరుణ, పీఏసీఎస్ డైరెక్టర్లు గుండె ఆదినారాయణ, మొర్రిమేకల నాగేశ్వరరావు, నాయకులు నల్లమల్ల ఆనంద్, చంద్ర రాంబాబు, సంక్రాంతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమ శాఖ బాలుర–బి వసతిగృహంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం వసతిగృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా వార్షిక పరీక్షల కోసం పది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మెటీరియల్ అందిస్తుందన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన సహస్ర చండీయాగం



పూజలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: లోక కల్యాణం కోసం నగరంలోని మమత రోడ్‌లో ఆరు రోజులపాటు నిర్వహించిన సహస్ర చండీ సహిత మహారుద్ర యాగం శుక్రవారం రాత్రితో ముగిసింది. చివరి రోజున వివిధ పూజా కార్యక్రమాలతో కార్యక్రమాన్ని నిర్వాహకులు సంపూర్ణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాను రవికిరణ్‌శర్మ, యాగకర్త దండ్యాల లక్ష్మణ్‌రావు, గుర్రం మురళి, గుర్రం వాసు దంపతులు, వేంపటి సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, చెరుకూరి కృష్ణమూర్తి, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పోరాటంతోనే భూసేకరణ రద్దు

ఖమ్మంమయూరిసెంటర్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల రైతులు, ప్రజల పోరాట ఫలితంగా ప్రభుత్వం ఫార్మా విలేజ్‌కు సంబంధించిన భూసేకరణను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలపై పెట్టిన కేసులను ఎత్తివేసి, జైలులో ఉన్న వారిని విడుదల చేయాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ 2013 చట్టం ప్రకారమే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేసిందని, అది మర్చిపోయి అధికారంలోకి వచ్చాక బలవంతపు భూసేకరణకు పాల్పడితే ఎలాంటి పరిస్థితి ఉంటుందో లగచర్ల రైతులు చూపించారన్నారు.

▮ విజయవంతం చేయండి

● మాలల సింహగర్జన..



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్ (ఖమ్మం మామిళ్లగూడెం): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని జింకాన గ్రౌండ్స్‌లో నిర్వహించే మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం కోరారు. శుక్రవారం ఖమ్మం అంబేడ్కర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర నాయకులు లింగాల రవికుమార్, సత్యనారాయణ, రాజశేఖర్, వెంకన్న, ప్రతాప్, బాబురావు, సుధాకర్, కనకరాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

● మహిళా రిజర్వేషన్ సదస్సు..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో డిసెంబర్ 6న వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన రాజ్యాధికారం, మహిళా రిజర్వేషన్‌పై నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా మహిళా అధ్యక్ష, కార్యదర్శులు భుక్య ఉపేంద్రాబాయి, త్రివేణి అన్నారు. శుక్రవారం ఖమ్మం బీకేబజార్ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఝాన్సీ, జ్యోతి, రమ, ప్రమిల, లలిత తదితరులు పాల్గొన్నారు.

● సకల జనుల భోజనాలు..

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయ వర్గ ప్రయోజనాల కోసం ప్రజలను కులాల వారీగా విడగొట్టే ప్రయత్నంలో భాగంగా జరుగుతున్న కుల భోజనాలను నిరసిస్తూ సకల జన భోజనాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రావన్న మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు గుర్రం అచ్చయ్య, కార్యదర్శి పుసులూరి నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.డిసెంబర్ 1న ఆదివారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జన భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● నేటి పాఠశాలల బంద్..

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇటీవల జరుగుతున్న కలుషిత ఆహారం ఘటనలకు వ్యతిరేకంగా శనివారం పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన విద్యార్థి సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు, అధ్యక్షుడు ఇటికాల రామకృష్ణ, తుడం ప్రవీణ్, వంగూరి వెంకటేష్, క్రాంతి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను జయప్రదం చేయాలన్నారు.

● సర్వసభ్య సమావేశం..

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లో దివ్యాంగ ఉద్యోగుల సర్వసభ్య సమావేశాన్ని డిసెంబర్ 1వ తేదీన జరగనున్న నేపథ్యంలో దివ్యాంగ ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఖమ్మం జిల్లా ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ నాగులు, ప్రధాన కార్యదర్శి గుండాల మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో సమావేశానికి హాజరుకావాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు బండి నాగేశ్వరరావు, తిగుళ్ల శ్రీనివాస్, పృథ్వీ, ఈదయ్య, వెంకటేశ్వర్లు, చావా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

● ఐఏఎల్ మహాసభలు..

ఖమ్మం లీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) తెలంగాణ 2వ రాష్ట్ర మహాసభ, రాష్ట్రస్థాయి సదస్సు శని, ఆదివారాల్లో హన్మకొండ హోటల్ హరిత కాకతీయలో నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. ఈ కార్యక్రమాలకు జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ఉదయం 7 గంటలకు బస్సు బయలుదేరుతుందని, న్యాయవాదులందరూ హాజరుకావాలన్నారు.

● రైతు పండగ..

నేలకొండపల్లి: మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రైతు పండుగకు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు బి.సరిత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కాగా, రైతు పండగ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్లులో, తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో, నేలకొండపల్లి, కూసుమంచి మండల కేంద్రాలలోని రైతు వేదికలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, ఏఈఓలు అవినాష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వ బ్రాహ్మణ వనసమారాధన

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన 60వ డివిజన్ రామన్న పేట మామిడితోటలో శుక్రవారం వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వీరాచారి, బచ్చల పద్మాచారి, చెన్నోజు పుల్లయ్య, మండలోజు వాసుదేవరావు, రామాచారి పాల్గొన్నారు.

‘స్మార్ట్ కిడ్జ్’ విద్యార్థులు..



క్రీడలను పర్యవేక్షిస్తున్న కరస్పాండెంట్ కృష్ణచైతన్య

ఖమ్మం సహకారనగర్: స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యాన చెరుకూరి వారి మామిడితోటలో శుక్రవారం వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్యలు మాట్లాడుతూ.. కార్తీక మాసం సందర్భంగా వన సమారాధనకు తీసుకొచ్చామన్నారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

రేపు రెడ్డి ఉద్యోగుల వన సమారాధన

ఖమ్మంగాంధీచౌక్: ప్రభుత్వ రెడ్డి ఉద్యోగుల ఆత్మీయ కలయిక, కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఖమ్మం బల్లేపల్లిలోని మలీదు జగన్ మామిడితోటలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు రెడ్డి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డాక్టర్ కె.సత్యనారాయణరెడ్డి, దగ్గుల మాధవరెడ్డి, వై.శ్రీకాంతరెడ్డి తెలిపారు. ఈమేరకు ప్రతినిధులు శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గాదె మాధవరెడ్డి, బైరెడ్డి పుల్లారెడ్డి, జంగా నాగార్జునరెడ్డి, రావుల శ్రావణ్‌రెడ్డి, యరమల అశోక్‌రెడ్డి, బొగ్గుల వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా పశువులకు నట్టల నివారణ మందులు తాగించడం, గర్భకోశ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం గ్రామంలో దూడల ప్రదర్శన నిర్వహించి రైతులకు బహుమతులు అందించారు. పశు వైద్యాధికారి సాహిత్య, గోపాలమిత్ర సూపర్‌వైజర్ జె.శంకరయ్య, ఎం.వెంకటేశ్వరరావు, జేవీఓ రామారావు, గోపాల మిత్రలు వై.వెంకటేశ్వరరావు, వెంకటప్రసాద్, వి.ఆంజనేయులు, తాజ్‌పాషా, నరసింహరావు, నరేష్, నాగరాజు, వెంకట్రావ్, రైతులు పాల్గొన్నారు.

నూతన సాగు పద్ధతులు పాటించాలి

కూసుమంచి: వరిలో రైతులు నూతన సాగు పద్ధతులు చేపట్టి పెట్టుబడులను తగ్గించుకోవాలని ఏఓ వాణి సూచించారు. శుక్రవారం మండలంలోని మద్దివారిగూడెంలో డ్రమ్ సీడర్, నేరుగా వెదజల్లే పద్ధతిలో వరిని సాగు చేయడంపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నూతన సాగుతో ఎకరాకు రూ.8 వేల వరకు పెట్టుబడులను తగ్గించవచ్చని, కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. ఆమె వెంట ఏఈఓ రవీందర్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవ సాహిత్యం యువతరానికి స్ఫూర్తి

ఖమ్మంమయూరిసెంటర్: మహనీయులు మార్క్స్–పూలే–అంబేడ్కర్‌ల స్ఫూర్తితో సామాజిక విప్లవ సాహిత్యాన్ని నేటి యువతరం అధ్యయనం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపాటి మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్‌పీ క్యాంప్‌లోని ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ ప్రచురించిన ప్రతిఘటన మాసపత్రికను వారు ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, కొమ్ము శ్రీను, చిరంజీవి పాల్గొన్నారు.